క్లుప్తంగా

దోమల నిర్మూలనతోనే వ్యాధులు దూరం



నెల్లూరు(అర్బన్): దోమలను నిర్మూలించడంతోనే డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులను దూరం చేయొచ్చని మలేరియా నివారణ సహాయాధికారి నాగార్జునరావు పేర్కొన్నారు. డెంగీ కేసు నమోదైన మైపాడు గేట్ సమీపంలోని పీసీనాయుడి వీధిలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఫ్రైడే .. డ్రైడే, లార్వా సర్వే ఇండోర్‌స్పేస్ స్ప్రేయింగ్ కార్యక్రమాలను నిర్వహించారు. వీటిని ఆయన పరిశీలించారు.

ఘన సన్మానం



నెల్లూరు (టౌన్): నగరంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రామారావు తదితరులు సత్కరించారు.

కుంభమేళాకు ప్రత్యేక బస్సు

నెల్లూరు రూరల్: కుంభమేళాకు నెల్లూరు నుంచి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక బస్సును నడపనుందని జిల్లా టూరిజం అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయం నుంచి ఈ నెల 12వ తేదీ ఉదయం ఆరు గంటలకు బయల్దేరి వివిధ ప్రాంతాల మీదుగా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందని చెప్పారు. టికెట్ ధర పెద్దలకు రూ.25 వేలు, పిల్లలకు రూ.22,500గా నిర్ణయించారన్నారు. దర్శనం, అల్పాహారం, భోజన ఖర్చులను భక్తులే భరించాల్సి ఉంటుందని, వివరాలకు 98480 07024 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇరిగేషన్ అధికారులపై మంత్రి ఆగ్రహం

నెల్లూరు(అర్బన్): నీటిపారుదల శాఖ జిల్లా అధికారులపై దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఫైరయ్యారు. తాగునీటి సరఫరా, ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షను ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో మంత్రి శుక్రవారం నిర్వహించారు. కండలేరులో నీటిపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రతి ఇంటికీ తాగునీటిని అందించే పనులు జరుగుతాయని చెప్పారు. ఇరిగేషన్ అధికారులను రిపోర్టు అడగ్గా, వివరాలు వారు చెప్తున్న క్రమంలో మంత్రి అడ్డు తగిలారు. ఏదో ప్రాజెక్ట్ రిపోర్టును ప్రభుత్వ ముఖాన కొట్టేస్తే సరిపోతుందనే ధోరణిని అధికారులు మార్చుకోవాలని, హాఫ్ మైండ్‌తో పని చేయొద్దని హెచ్చరించారు. పనిలో నిమగ్నమై సరైన డీపీఆర్‌ను ఇవ్వాలని పేర్కొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో న్యాయ విజ్ఞాన సదస్సు



నెల్లూరు (టౌన్): వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడారు. వీధి బాలలందరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్లు, మేనేజర్లకు శిక్షణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీలో బ్యాంక్ సూపర్‌వైజర్లు అసిస్టెంట్ మేనేజర్లు, మేనేజర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డీసీఓ గుర్రప్ప, సహకార శాఖ శిక్షణ కేంద్ర ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డీసీసీబీ ప్రత్యేకాధికారి అంజిరెడ్డి, సీఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

▶▶ నగరానికి చెందిన ఓ బాలుడు మాగుంట లేఅవుట్లోని ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. స్నేహితులతో కలిసి టిఫిన్ తెచ్చుకునేందుకు రెండు రోజుల క్రితం మధ్యాహ్న సమయంలో బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు.

▶▶ రంగనాయకులపేటకు చెందిన ఓ బాలుడు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. మారం తట్టుకోలేక కళాశాలకు వెళ్లేందుకు ద్విచక్రవాహనాన్ని తల్లిదండ్రులిచ్చారు. తన స్నేహితులను బైక్‌పై ఎక్కించుకొని వేగంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొన్నారు. ఘటనలో స్కూటీలోని వ్యక్తి స్వల్పంగా గాయపడగా, బాలుడి చేతికి తీవ్రగాయమైంది.

▶▶ శెట్టిగుంటరోడ్డుకు చెందిన ఓ బాలుడు బైక్‌పై ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్‌పైకి వచ్చేసరికి వేగాన్ని నియంత్రించలేక అదుపుతప్పి కిందపడ్డారు. తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. ఇలా వాహనాలు నడుపుతూ మైనర్లు ప్రమాదాలకు గురై కన్నవారికి శోకాన్ని మిగిలిస్తున్నారు.

చేతిలో బండి.. గాల్లో ప్రాణాలు

- బైక్‌లను యథేచ్ఛగా నడిపేస్తున్న మైనర్లు
- తరచూ ప్రమాదాలకు గురవుతూ..
- అడ్డుకోకపోతే తీవ్ర పరిణామాలు



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా (ఫైల్)



వాహనం నడుపుతున్న మైనర్

నెల్లూరు(క్రైమ్): అతి గారాబం.. అడిగింది ఇవ్వకపోతే బాధపడతారని.. ఇలా కారణమేదైనా మైనర్లకు వాహనాలిస్తూ వారు ప్రమాదాలకు గురవ్వడానికి తల్లిదండ్రులు కారణమవుతున్నారు. వయస్సులో ఉండటం.. రోడ్డు భద్రతపై అవగాహన లేమి.. మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో ఏటా వందల మంది మృతి చెందుతుండగా, అధిక శాతం మంది గాయపడుతున్నారు. ఇటీవలి కాలంలో ప్రమాదాలకు కారకులుగా మైనర్లు నిలుస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నా.. మార్పేదీ..?

ఇటీవలి కాలంలో నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులతో పాటు స్థానిక పోలీసులు వాహన తనిఖీలను నిర్వహిస్తున్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని అవగాహన కల్పిస్తున్నా.. జరిమానాలు విధిస్తున్నా వారిలో ఎలాంటి మార్పురావడం లేదు. మరోవైపు కళాశాలలు వదిలే సమయంలో విన్యాసాలు చేస్తూ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. రద్దీ ప్రాంతాల్లో అతి వేగంగా వెళ్తూ వాహనాదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

వాస్తవానికి మైనర్లు ఎలాంటి వాహనాలను నడపకూడదు. ఇదే విషయమై ప్రధాన కూడళ్లతో పాటు విద్యాసంస్థల్లో పోలీసులు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. మరోవైపు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు బైక్‌లపై విద్యార్థులు వస్తున్నా సంబంధిత యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నా, వారు పెడచెవిన పెడుతున్నారు. పోలీసులు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లలో పదుల సంఖ్యలో మైనర్లు పట్టుబడుతున్నారు. వీరిలో ఎక్కువ మంది ట్రిపుల్ రైడింగ్ చేస్తుండటం గమనార్హం.

నమోదైన కేసులు..
2023 – ఆరు
2024 – 15
2025 – మూడు (ఇప్పటి వరకు)

తల్లిదండ్రులూ బాధ్యులే..

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం ఎంత నేరమో.. పిల్లలకు వాటిని ఇవ్వడమూ అంతే నేరం. మోటార్ వాహనాల చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన వారే డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హులు. అలా కాకుండా వాహనం నడిపితే తల్లిదండ్రులూ బాధ్యులవుతారు. వాహనాలను మైనర్లు నడుపుతూ ప్రమాదానికి కారకులైతే సంబంధిత వాహన యజమానీ కేసులో నిందితుడవుతారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు



"వాహనాలను మైనర్లు నడపడం నేరం. ఇలాంటి ఘటనల్లో మైనర్లతో పాటు వారికి వాహనాలిచ్చిన వారిపై సైతం కేసులు పెడతాం. తల్లిదండ్రుల్లో మార్పురావాలి. పిల్లల సరదా కోసం ఆలోచిస్తే వారితో పాటు బయటి వారూ ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది.

– రామకృష్ణ, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

దాడులు చేయడం హేయం



మోహన్‌రావును పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- మోహన్‌రావుకు అండగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): తమ పార్టీ కార్యకర్తలు, నేతలపై టీడీపీ నేతలు దాడులు చేయడం హేయమైన చర్యని కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ నార్తురాజుపాళెం అధ్యక్షుడు, మాజీ వీఆర్వో మోహన్‌రావును శుక్రవారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, దీన్ని అడ్డుపెట్టుకొని దాడులకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. కోవూరు నియోజకవర్గానికి మంచి పేరుందని, దాన్ని చెడగొడుతూ సౌమ్యుడిగా, మంచివాడిగా పేరు తెచ్చుకున్న మోహన్‌రావుపై దాడి చేయడం బాధాకరమన్నారు. తాము సుకుంటే టీడీపీ నేతలు, కార్యకర్తలు గ్రామాల్లో తిరగలేరని హెచ్చరించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, పార్టీ విడవలూరు, కోవూరు మండలాధ్యక్షులు నవీన్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, నేత సాయిరెడ్డి పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి అగ్నిప్రవేశ మహోత్సవం



నిప్పుల గుండాన్ని తొక్కుతున్న భక్తురాలు

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి అగ్నిప్రవేశ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. తొలుత రంగనాథస్వామి దేవస్థాన సమీపంలోని పినాకినీ తీరంలో గంగాదేవి పూజా మహోత్సవాన్ని ప్రధానార్చకులు, శ్రీపీఠం గురువులు లలితా శివకుమార్‌స్వామి, కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం పవిత్ర జల కలశాలతో రంగనాయకులపేట నుంచి స్టోన్‌హౌస్‌పేటలోని దేవస్థానం వరకు నగరోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి, లలితా సహస్రనామ, దుర్గా, నవగ్రహ, సూక్త, రుద్రహోమాలు, కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు చేశారు. కన్యపూజ, సువాసినిపూజ, ఆలయ ప్రదక్షిణలను జరిపారు. 25 మందికిపైగా భక్తులు నిప్పులగుండ ప్రవేశం చేశారు. ఉభయకర్తలుగా కోట గురుబ్రహ్మం, స్వరాజ్యలక్ష్మి, దాసా సురేష్ కుటుంబసభ్యులు, గ్రంధి సురేష్‌కుమార్, వాకాటి విజయకుమార్, కూరపాటి వెంకటసతీష్ చంద్రబాబు, హరిప్రసాద్, వెల్లంపల్లి రామకృష్ణయ్య తదితరులు వ్యవహరించారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముగరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి వొమ్మిన జనార్దన్‌రావు, ఆంజనేయులు, పైడా కృష్ణప్రియ, పాబోలు వెంకటసత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

చెత్త సేకరణదారులను గుర్తించండి



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో ప్లాస్టిక్ వ్యర్థాలు, నిరుపయోగ వస్తువులను సేకరించి మార్కెట్లో విక్రయించి జీవనం సాగించే వారిని గుర్తించి ఆర్థిక భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ నందన్ పేర్కొన్నారు. నేషనల్ యాక్షన్ ఫర్ మైకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ కార్యక్రమంపై కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎంహెచ్‌ఓ చైతన్య నోడల్ అధికారిగా, 30 మంది వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శుల బృంద సర్వేను నిర్వహించనుందని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి విక్రయించుకునే వారి వివరాలను యాప్‌లో నమోదు చేయించి, వారితో సమావేశాన్ని నిర్వహించనున్నామని వెల్లడించారు. వీరికి ఉచిత వాహనాలతో పాటు అయుష్మాన్ కార్డులను అందజేయనున్నామని చెప్పారు. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ సాయికృష్ణ, శానిటేషన్ సూపర్‌వైజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

- వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులు తమ సచివాలయ పరిధిలోని ఆక్రమణలను గుర్తించి తగు చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆక్రమణకు గురైన నగరపాలక సంస్థ స్థలాలను గుర్తించి చార్జిషీట్‌ను దాఖలు చేయాలని సూచించారు. డీసీపీ పద్మజ, ఏసీపీ వేణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

14వ డివిజన్లో పారిశుధ్య పనులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని 14వ డివిజన్లో పారిశుధ్య పనులను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. ద్వారకామాయినగర్, పద్మావతినగర్‌లోని కాలువల్లో ఆయిల్‌బాల్స్‌ను వదిలారు. ఎస్వీజీఎస్ కళాశాల ప్రాంతంలోని కాలువల్లో పూడికను జేసీబీతో తీయించారు. కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన రంగనాయకులపేట రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 75 ఏళ్లలోపు వయస్సు కలిగి.. పింక్, బ్లూ కలర్ గళ్లు కలిగిన మెరూన్ బార్డర్ హాఫ్ హ్యాండ్స్ చొక్కా, స్కై బ్లూ కలర్ గళ్ల లుంగీని ధరించి ఉన్నారు. విషయాన్ని గమనించిన స్థానికులు.. వీఆర్వో నరేంద్రబాబు, సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోలీసులు పరిశీలించారు. చుట్టుపక్కల విచారించగా, గడిచిన పదేళ్లుగా భిక్షాటన చేసుకుంటూ సమీపంలోని దుకాణాలు, రైల్వేగేట్ వద్ద నిద్రించే వారని తెలిసింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని వెల్లడించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

బిస్కెట్లు, పండ్లు పంపిణీ

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో వివిధ కార్యక్రమాలను జెడ్పీ వాకర్స్ సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత డిసెంబర్, జనవరిలో జన్మించిన 20 మంది సభ్యుల పుట్టిన రోజు వేడుకలను సంఘ కోశాధికారి వెంకటరమణయ్య ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి తన తల్లి సరస్వతమ్మ వర్ధంతిని పురస్కరించుకొని దివ్యాంగులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు చెలంచర్ల భాస్కర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు తుంగా నారాయణరెడ్డి, మెట్టు సుధాకర్‌రెడ్డి, చెంచయ్య, ఖాజామస్తాన్, రాజగోపాల్, కృష్ణయ్య, హర్షవర్ధిని, ఎస్తేర్‌రాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం మెయిన్ రోడ్డు, నల్లకాలువ, ఇస్లాంపేట, పునరావాస కాలనీ, లక్ష్మీవీధి, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

గౌడ కులస్తులకు అన్యాయం



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): మద్యం దుకాణాల కేటాయింపులో గౌడ సామాజికవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో 180 మద్యం దుకాణాలుండగా, 18 షాపులను కల్లుగీత సొసైటీలకు కేటాయించనున్నామని అధికారులు తెలిపారన్నారు. ఇందులో కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల మినహా, నెల్లూరు సిటీ.. రూరల్, వెంకటగిరిలో ఒకటి చొప్పున, కందుకూరు, ఉదయగిరిలో నాలుగు చొప్పున, కావలిలో మూడు, ఆత్మకూరులో ఐదు షాపులను కేటాయించారని పేర్కొన్నారు. ఎక్కడైతే బాగా ఆదాయం గడిస్తారో అక్కడ మాత్రం వైన్‌షాపులను కేటాయించమని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అసలు ఏ ప్రాతిపదికన కల్లుగీత సొసైటీలకు మద్యం దుకాణాలను కేటాయిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వింజమూరు, దుత్తలూరు, కలిగిరి, దగదర్తి, కలువాయి, అనంతసాగరం ఇలా దూర దూరంగా ఉండే ప్రాంతాల్లో దుకాణాలను కేటాయించారని చెప్పారు. మద్యం దుకాణాల ఏర్పాటుకు ముందే గౌడ సామాజికవర్గానికి పది శాతాన్ని కేటాయించి ఉంటే బాగుండేదని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేలకు వాటాలను కేటాయిస్తే తప్ప, అనుమతులొచ్చే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. సర్వేపల్లి నియోజకవర్గానికి ఒక్క షాపును సైతం కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఇక్కడ మూడో వంతు వాటాను సోమిరెడ్డికి ఇస్తే తప్ప మద్యం షాపులను నడిపే పరిస్థితే లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. కల్లుగీత కార్మికులు, సొసైటీల నేతలు, గౌడ కులస్తులకు జరుగుతున్న అన్యాయంపై తమ పార్టీ అండగా ఉండి, వారి కోసం న్యాయపోరాటం చేసేందుకు సిద్ధమని ప్రకటించారు.

అసమర్థతను అంగీకరించిన బాబు



మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

- ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేనని ప్రకటించి తన అసమర్థతను సీఎం చంద్రబాబు అంగీకరిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. నీతి ఆయోగ్ లెక్కలంటూ.. ఏ హామీనీ అమలు చేయలేనని ప్రకటించడం ఆయన దివాలాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్ల అప్పులు చేసిందంటూ విష ప్రచారం చేశారని, ఆ తర్వాత వారు ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఈ అప్పులు రూ.6,46,537 కోట్లు మాత్రమేనని తేల్చిన అంశాన్ని ప్రస్తావించారు. ప్రజలను వంచించడమే ఆయన నైజమని ఆరోపించారు. వృద్ధి రేటు 15 శాతానికి పెరిగితేనే సూపర్ సిక్స్‌ను అమలు చేయగలమని చెప్తున్నారని, దీనికంటే ప్రజావంచన మరొకటి ఉండదని చెప్పారు. సంక్షేమ పథకాల రూపంలో రూ.మూడు లక్షల కోట్లను ప్రజలకు నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించారని కొనియాడారు. మాటిచ్చి తప్పినందుకు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబును నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యేలు అరాచకాలు సాగిస్తున్నారని, ప్రకృతి వనరులను దోచుకుంటున్నా, చంద్రబాబు మౌనంగా ఉంటున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని స్పష్టం చేశారు. పార్టీ జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు లక్ష్మీసునంద, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, సత్తార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ లేబూరు పరమేశ్వరరెడ్డి, అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, నెల్లూరు రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం



మాట్లాడుతున్న సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, కేసుల ఛేదనకు సీసీ కెమెరాలు దోహదపడతాయని నగర డీఎస్పీ సింధుప్రియ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకతపై ఆర్యవైశ్య బులియన్.. నెల్లూరు గోల్డ్ అండ్ డైమండ్స్.. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ల సభ్యులకు అవగాహన సదస్సును ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో చిన్నబజార్, సంతపేట పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నేరాలు జరగకుండా ఉండేందుకు గానూ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, దశరథరామారావు తదితరులు పాల్గొన్నారు.

– నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ వ్యాపార వర్గాల ప్రతినిధులతో సమావేశాన్ని స్థానిక ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. వీటిని ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.